క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎట్టకేలకు చెక్కులు పంపిణీ చేశారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ, బెల్లంపల్లి మండల పరిధికి చెందిన 86మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'రోడ్డుపై కోతులకు ఆహారం వేయొద్దు'

జైపూర్: జైపూర్ అటవీ ప్రాంతంలో గల మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై ఉన్న కోతులకు ఆహారం వేయొద్దని ఎఫ్ఆర్వో రత్నకర్‌రావు అన్నారు. రోడ్డు పక్కన ఆహారం వేయడం వల్లప్రమాదాలు జరిగి చనిపోతున్నాయని తెలిపారు. ఆహారం వేసిన శ్రీరాంపూర్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఆహారానికి అలవాటు పడి అడవుల్లో సహజ జీవనాన్ని కోల్పోతున్నాయని, జనావాసాల్లోకి వస్తున్నాయని ఎఫ్ఎస్‌వో రామకృష్ణ వివరించారు.

మహాసభ కరపత్రాల ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో మంగళవారం యూఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ.. ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యూఎస్ఎఫ్ఐ మొట్టమొదటి అఖిల భారత మహాసభలు 2024 డిసెంబర్ 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని, విద్యాహక్కు చట్టం అమలు నోచుకోవడం లేదన్నారు. దేశంలో కొఠారి కమీషన్ ప్రకారం నిధులు కేటాయించాలని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యను పూర్తిగా మతోన్మాద భావజాలంలోకి తీసుకుపోయే విధంగా నిర్ణయాలు చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సరిత, రమ్య, మేఘన, రమేశ్, క్రాంతి కుమార్, రవితేజ, భీమేశ్ పాల్గొన్నారు.

'డిపాజిట్ డబ్బులు చెల్లించండి'



బాండు చూపిస్తున్న బాధితుడు

మందమర్రిరూరల్: సహారా ఇండియాలో డిపాజిట్ చేసి గడువు తర్వాత డబ్బులు వస్తాయని ఎదురు చూసిన డిపాజిట్ దారులకు సంస్థ మెచ్యూరిటీ డబ్బులు తిరిగి చెల్లించడం లేదని బాధితులు చిలుక సంజీవ్ మంగళవారం ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2014లో సంస్థలో రూ.2లక్షలు డిపాజిట్ చేస్తే, ఆరు సంవత్సరాలకు రూ.5లక్షల 14వేల92 మెచ్యూరిటీ విలువ ఉంటుందని ఆఫీస్‌లో పనిచేసే తిరుపతిరావు, శ్రీనివాసరావు వివరించడంతో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి మెచ్యూరిటీ డబ్బులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫీస్‌లో అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారన్నారు. ఈ విషయమై మందమర్రి పోలీస్‌స్టేషన్లో కూడా ఫిర్యాదు చేశానని, నాలాంటి బాధితులు చాలా మంది ఉన్నారని, తనకు డబ్బులు చెల్లించపోతే చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు.

స్వీప్‌పై అవగాహన



పొక్కూరులో స్వీప్‌పై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్వీప్‌పై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు గాను ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం దత్తకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజార్ నిర్మాణంలో జాప్యం..!

- ఏళ్లు గడుస్తున్నా ప్రహరీకే పరిమితం
- చిత్తశుద్ధి చూపని పాలకులు, అధికారులు
- నిరాశ చెందుతున్న రైతులు, కొనుగోలుదారులు



రైతు బజార్ ముఖద్వారం వద్ద నిర్మించిన కమాన్



షెడ్ల నిర్మాణ స్థలంలో ఏపుగా పెరిగిన వృక్షాలు

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో పాత మున్సిపల్ కార్యాలయం ముందు సింగరేణి ఖాళీ స్థలాన్ని రైతుబజారు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించగా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బజార్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయగా కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం కావస్తున్నా పరిస్థితుల్లో తేడా లేకుండా ఉంది. రూ.2కోట్ల అంచనాతో రైతుబజార్ నిర్మాణ పనులను ప్రతిపాదించారు. వీటిలో ఇప్పటి వరకు కేవలం ప్రహరీ తప్పా.. జరిగిన పనులేవీ లేవు. రైతుబజార్ కోసం నిర్దేశించిన స్థలంలో వృక్షాలు ఏపుగా పెరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుబజార్ నిర్మాణంపై కనీస శ్రద్ధ చూపకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా అటు కూరగాయలు పండించే రైతుల్లో ఇటు కొనుగోలు దారుల్లో నిరాశ నెలకొంది. ఎప్పటి వరకు రైతు బజార్ ఏర్పాటు చేస్తారో స్పష్టత లేకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అతీగతిలేని షెడ్లు ..

రైతుబజార్‌లో ప్రధానంగా షెడ్లు నిర్మించి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. ఏడు షెడ్లను నిర్మించాలని మున్సిపల్ అధికారులు ఎస్టిమెట్ చేసినప్పటికీ, ఒక్క అడుగుకూడా ముందుకు పడలేదు. వీటిలో ఇంతవరకు ఒక షెడ్ కూడా నిర్మించలేదు. అంతర్గత రోడ్ల నిర్మాణాల ఊసు లేకుండా పోయింది. పనుల్లో పురోగతి లేక రైతు బజార్ దుస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు తదితర పనులన్నీ పడకేశాయి. ఆదిలో ఎంతో ఆర్భాటం చేసి అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టింపు చేయకపోవడంతో రైతు బజార్ ఏర్పాటవుతుందా లేదా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతుండగా ఇప్పటి వరకు రూ.30లక్షల విలువ కలిగిన పనులు జరిగినట్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఆ పనుల తాలూకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోవడంతో రైతుబజార్ నిర్మాణం పడకేసినట్లుగా తెలుస్తోంది.

పల్లెల్లో కూరగాయల సాగు..

బెల్లంపల్లి చుట్టుప్రక్కల ఉన్న గ్రామాల్లో దశాబ్దాల నుంచి కూరగాయల సాగు జరుగుతోంది. కన్నెపల్లి, భీమిని, నెన్నెల, తాండూర్ మండలాలతో పాటు బెల్లంపల్లి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏళ్ల తరబడి నుంచి కూరగాయలు పండించడం ఆనవాయితీగా వస్తోంది. వీటితో పాటు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గంగాపూర్ నుంచి కూడా రోజువారీగా బెల్లంపల్లి మార్కెట్‌కు కూరగాయలు రవాణా అవుతాయి. తాజా కూరగాయల విక్రయాలకు బెల్లంపల్లి మార్కెట్ ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇతరప్రాంతాలతో పోల్చితే ఇక్కడ చౌకధరకు నాణ్యతతో కూడిన కూరగాయలు లభిస్తాయనే అభిప్రాయం కొనుగోలు దారుల్లో ఉంది. రైతులు చెమటోడ్చి పండించిన కూరగాయలను కనీస మద్దతు ధరకు అమ్ముకోవడానికి, దళారుల ప్రమేయం లేకుండా రైతుల నుంచి నేరుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఉపయోగకరంగా ఉంటుందనే ఉద్దేశంతో రైతు బజార్‌ను ప్రతిపాదించిప్పటికీ అసాధారణ జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ అధికారులు, పాలకులు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా నిర్లిప్తతను వీడి రైతు బజార్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రైతుబజారు నిర్మాణ పనులు కొంతవరకు జరిగాయి. రూ.2కోట్ల అంచనాతో చేపట్టిన పనుల్లో రూ.30లక్షల వరకు పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో పనులు చేయకుండా ఆపేశాడు. ప్రస్తుత పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తిరిగి రైతుబజార్ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– సాయి కిరణ్, మున్సిపల్ డీఈ, బెల్లంపల్లి



గూడెం ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తూ..

కార్తిక సందడి..!

దండేపల్లి: కార్తిక ఏకాదశి సందర్భంగా దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు సత్యదేవున్ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు దంపతులు సామూహిక సత్యనారాయణవ్రతాలు నోముకున్నారు. ప్రధాన ఆలయ ఆవరణలో, గుట్టకింద రావిచెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. భక్తులు, ఆలయాలు, ఇళ్లలోను ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గోవుకు పూజలు చేశారు.

భీమిని: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కన్నెపల్లి, భీమిని మండలాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కన్నెపల్లి, జన్కాపూర్ గ్రామాల్లో మంగళవారం సర్వమానవ శ్రేయస్సును కోరుతూ నగర సంకీర్తన చేపట్టారు. కన్నెపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి, జన్కాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయాల నుంచి భక్తులు శ్రీరామ నామ స్మరణ చేస్తూ, ఆధ్యాత్మిక భక్తి పాటలు పడుతూ గ్రామాల్లోని పురవీధుల గుండా తిరిగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జన్కాపూర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలి

వేమనపల్లి: ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యాశాల ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వంద సభ్యత్వాలు పూర్తి చేసి బూత్ అధ్యక్షుడిని ఎన్నుకోవాలన్నారు. శక్తి కేంద్రాల వారీగా రిటర్నింగ్ ఆఫీసర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు శ్రీకాంత్, రవి, అజయ్, కుబిడె అంజి, దుర్గం పుల్లయ్య పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగంగా చేపట్టాలి

నెన్నెల: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగంగా చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దీక్షితులు అన్నారు. ప్రతి బూత్‌లో 100మందిని సభ్యులుగా చేర్పి అధ్యక్షుడిని ఎన్నుకోవాలని సూచించారు. మండల బీజేపీ అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పార్టీకి 2500సభ్యత్వాలు పూర్తి చేయడంపై నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వంశీ, నాయకులు సతీష్, వెంకటేశ్వర్లు, రాజన్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో హోమ్ డెలివరీపై అవగాహన ర్యాలీ

మంచిర్యాలటౌన్: టీజీఎస్ఆర్టీసీ కార్గో హోమ్ డెలివరీ సేవలను ప్రవేశపెట్టగా, ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కేంద్రంలో ఉద్యోగులు, హమాలీలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ కార్గో మేనేజర్ బి. పాల్ ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో ఉండే వినియోగదారులకు హోమ్ డెలివరీ సేవలు మరింత వెసులుబాటును కల్పిస్తాయని తెలిపారు. జంట నగరాల్లో 131ఏరియాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. అతి తక్కువ చార్జీలతో పార్సిల్స్ వేగంగా చేరుతాయని, మంచిర్యాల పట్టణ ప్రాంత ప్రజలు, వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మడావి దేవపాల, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు మహేశ్, రమేశ్, మల్లేశ్, ఇంచార్జి ఎస్. అశోక్ రావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్గో ఉద్యోగులు

రైతులకు న్యాయం చేయాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న రఘునాథ్

నస్పూర్: జాతీయ రహదారి 363విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. సమీకృత కలెక్టరేట్ వద్ద 363జాతీయ రహదారి విస్తరణ బాధితులతో కలిసి ఆయన మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. హాజీపూర్, లక్సెట్టిపేట మండలాలకు చెందిన పలువురు రైతులు గతంలో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయారన్నారు. ఇప్పుడు జాతీయ రహదారి విస్తరణలో మళ్లీ తమ భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న వారికి న్యాయం జరగకపోతే రహదారి విస్తరణను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు సమర్పించారు. కార్యక్రమంలో బుద్దె లక్ష్మణ్, గడ్డం స్వామిరెడ్డి, రమేశ్, కుర్రె చక్రి, బింగి ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆనంద నిలయంలో అన్నదానం

మంచిర్యాలటౌన్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లో నిర్వహిస్తున్న ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో మంగళవారం మంచిర్యాల మహిళా తరంగిణి సభ్యులు అన్నదానం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు.

15 వరకు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15(కార్తికపౌర్ణమి)వరకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు దంపతులు భక్తులకు ఉచితంగా పులిహోర, మజ్జిగా, మంచినీరు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం ప్రారంభించారు.

బీమా చెక్కు అందజేత

వేమనపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దుర్గం దేవాజీ మరణించగా అతడి భార్య సుగుణకు పీఎంజేజేబీవై స్కీం కింద మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును నీల్వాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివశంకర్ అందజేశారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని రెబ్బనపల్లి, కొర్విచెల్మ, గూడెం, కొత్తమామిడిపల్లి, గుడిరేవు, మాదాపూర్, ధర్మరావ్‌పేట, ద్వారక, కొండాపూర్, కాసిపేట, లింగాపూర్, మాకులపేట, తాళ్లపేట, నర్సాపూర్, లక్ష్మీకాంతపూర్, గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్ మంగళవారం ప్రారంభించారు.

బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

నస్పూర్: అర్హత కలిగిన ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ మేనేజర్ నరసింహస్వామి సూచించారు. గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సీతారాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు.

అమర వీరుల వర్ధంతి సమావేశం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమరవీరుల వర్ధంతి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం, మండల నాయకులు సంతోష్, రాజ్‌కుమార్, రవీందర్, ఇబ్రహీం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రతీ డెజిగ్నేషన్ ఉత్తమమైనదే..

- ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం శ్రీధర్ రావు

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రతి డిజిగ్నేషన్ ఉత్తమమైనదేనని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి ఎస్‌వోటు జీఎం శ్రీధర్ రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని కార్యాలయంలో మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్, ఎస్సార్పీ 1, ఎస్సార్పీ 3 గనుల్లో పనిచేసే మహిళ బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్‌లోని 16 డిజిగ్నేషన్ల ఉద్యోగాల గురించి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్ బాబు, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణ అధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారులు శంకర్, గౌస్ పాషా పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కాంట్రాక్ట్ ఉద్యోగి నిజాయతీ

రామకృష్ణాపూర్: చెత్తలో దొరికిన బంగారు ఉంగరాన్ని అందించి సింగరేణి కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు తన నిజాయతీ చాటుకున్నాడు. పట్టణంలోని ఆర్‌కేసీవోఏ క్లబ్ ఎదురుగా గల ఏ టైప్ క్వార్టర్స్‌లో నివాసముండే ఎస్ఆర్‌పీ వోసీ అడిషనల్ మేనేజర్ జయంత్‌కుమార్ ఇంట్లో మంగళవారం బంగారు ఉంగరం(5 గ్రాములు) పోయింది. పొరపాటున చెత్త వేసే కవర్‌లో పడిపోయి ఉంటుందని భావించిన జయంత్‌కుమార్ స్థానిక సింగరేణి సివిల్ సూపర్‌వైజర్ సదానందంకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే సేకరించిన చెత్త ఇంకా డంప్‌యార్డుకు చేరకపోవడంతో పారిశుధ్య కార్మికుడు శాంతికుమార్ ఇతర మహిళా కార్మికులు తాము సేకరించిన చెత్త కవర్‌లో వెతకగా ఉంగరం దొరికింది. దొరికిన ఉంగరాన్ని సదరు అధికారికి అందించి నిజాయతీని చాటుకున్న పారిశుధ్య సిబ్బందిని పలువురు అభినందించారు.

విరాళాలు సేకరించి బాలుడికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: వేడి సాంబార్లో పడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న బాలుడు దుర్గా చరణ్ వైద్య ఖర్చులకు సింగరేణి ఉద్యోగులు ఆర్థిక సాయం అందించారు. మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన బేతి శ్యాం కుమార్–శైలజ దంపతుల కుమారుడు దుర్గా చరణ్ ఇటీవల కోతుల గుంపు రావడంతో పరిగెత్తుకుంటూ వెళ్లి సాంబార్‌లో పడడంతో అతడి శరీరం తీవ్రంగా కాలింది. గాయాలతో వరంగల్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకొని వైద్య చికిత్స నిమిత్తం ఆర్కే న్యూటెక్‌కు చెందిన బీ రిలే ఉద్యోగులు విరాళాలు పోగుచేసి రూ.16,400 మంగళవారం బాధిత కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. సాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు.

బొగ్గుబాయి వార్తలు

టీబీజీకేఎస్ ఫిట్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా గనిపై మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించి ఆర్కే న్యూటెక్ గని టీబీజీకేఎస్ నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ హాజరయ్యారు. ఫిట్ కార్యదర్శిగా ఉప్పల సంపత్, జనరల్ షిఫ్ట్ సెక్రెటరీగా అట్లూరి అనిల్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అడ్డూరి అనిల్, రాజ్‌కుమార్, జై కృష్ణ, రాజుతో పాటు 50మంది కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, ఎండీ లాల, గోనె స్వామి, బుద్ధి ప్రసాద్‌లు పాల్గొన్నారు.

బీసీ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: గనులపై మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆర్కే 5 గని కన్వీనర్‌గా పంచెర్పుల నరేశ్, కో కన్వీనర్‌గా కొట్టె శ్రీకాంత్, ఎస్సార్పీ 3 గని కన్వీనర్‌గా కాదాసి భీమయ్య, కో కన్వీనర్‌గా మనోజ్‌కుమార్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ముస్కే సమ్మయ్య, పేరం రమేశ్, కొమురయ్య పాల్గొన్నారు.

'చర్చనీయాంశంగా కాసిపేట 1గని ప్రమాదం'

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 1గనిలో మంగళవారం మొదటి షిఫ్టులో 4సీం డిస్ట్రిక్ట్11, డిప్15, లెవెల్30లో ప్రమాదం జరిగి సొతుకు కిషోర్‌కుమార్ అనే జనరల్ మజ్దూర్ కార్మికుడికి 8దంతాలు విరిగి దవడ భాగంలో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు జారిపడటంతో దెబ్బలు తాకినట్లు చెబుతుండగా, దెబ్బల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఏదో ప్రమాదం జరిగి బలమైన వస్తువు తాకితే తప్పా అంత తీవ్రంగా గాయాలు కావు అనే ఆరోపణలున్నాయి. దీంతో అధికారులు ఏది నమ్మడమో.. అని తలలు పట్టుకుంటున్నారు. రీజినల్ రక్షణ జీఎం, ఏజెంటుతో పాటు డీడీఎంఎస్ బుధవారం విచారణ జరిపినా పూర్తిస్థాయిలో సమాచారం సేకరించలేకపోయారు. ఏది ఏమైనా గనిలో జరిగిన సంఘటనపై అధికారులకు, సూపర్‌వైజర్లకు క్లారిటీ లేకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. రక్షణ పై నిఘా ఉంచకపోవడం సైతం ప్రధాన కారణమని తెలుస్తోంది. విచారణ అనంతరం తప్పు ఎవరిదో.. శిక్ష ఎవరికో అంటూ ఈ అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

రోడ్డుపై బైఠాయించి నిరసన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గని పక్క నుంచి శంకర్‌పల్లి వెళ్లే రోడ్డుకు అడ్డంగా సింగరేణి యాజమాన్యం మంగళవారం కంచె వేయాలని ప్రయత్నించగా శంకర్‌పల్లి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అయినప్పటికీ రోడ్డు కింది భాగంలో భూగర్భ గని బొగ్గుతీత పనులు జరుగుతున్నాయని, ఆ ఏరియా అంతా ప్రమాదకరంగా ఉంటుందని గని అధికారులు సూచిస్తూ కంచె వేయించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు దూట రాజం, కుమ్మరి బాపు, ఏస్కూరి రాజశేఖర్, తిరుపతి, సల్లూరి రవి, రాయమల్లు, బండారి రవి, నాగరాజ్ తదితరులు ఉన్నారు.



బైఠాయించిన శంకర్‌పల్లి గ్రామస్తులు

ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేశారు. యజమానులు షాపుల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త బండ్లలో వేయాలని కమిషనర్ సూచించారు. మున్సిపల్ చట్టం ప్రకారం ప్రతి దుకాణదారుడు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇప్ప రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్